# చెలిమె

తెలంగాణ ప్రజలకు భాష ఓ పిలుపు మాత్రమే కాదు. చరిత్ర మారినా చెదరని అస్తిత్వం. అందుకే తెలంగాణ ఘన సాహిత్యానికి పెద్దపీట వేస్తూ చెలిమెను నిర్వహిస్తున్నది మన పత్రిక. అలిసిసొలసిన వేళల్లో కళారూపాలైనా, పోరుబాటల్లో పాటలా మారినా, ఆత్మగౌరవాన్ని కథతో నినదించినా... తనదైన శైలి తెలంగాణది. ఆ సాహిత్యంలో మీకు ఎలాంటి అభిరుచి ఉన్నా, కలాన్ని కదిలించండి. ఆసక్తిగా, సూటిగా తెలంగాణ సాహిత్యానికి సంబంధించిన రచనలు చేయండి...
editpage@ntnews.com



## తర్జుమా అవసరమా?

పొగడ్తను మించిన తిట్టు లేదు
తిట్టును మించిన పొగడ్త లేదు
పొగడ్తనే కవచంగా పెట్టుకున్నవాడికి
ఎన్నితిట్లు తిట్టినా ఏం లాభం?

ప్రభువు వాస్తుతో శోభిల్లున్
పస్తులతో ప్రజలు శోషిల్లున్
కాసుల్లేక పొలముల్ అంగలార్చున్
పాలాభిషేకాలతో దేవుడికి జలుబు పట్టున్
అధముల డొక్కలు అగాధములగున్
కొందరు తమ పిక్కలతో ఎవరెస్టును మించిపోవున్

వేళ్లే ఆధారమైన ఆకాశానికి నిచ్చెనవేస్తున్న
కోటానుకోట్ల మెదళ్లను
ట్రంపాము రంపంతో సిద్ధంగా ఉన్నది
కీబోర్డును మౌస్ ఎత్తుకెళ్లి ఏ కన్నంలో దాచిందో
ఇప్పుడా ఇండియన్ వేళ్లకు
వేరేపని అలవాటయ్యేదాకా
కొంతకాలం అరచేతిని బొచ్చెగా మార్చుకోమనండి

ఆమె
ఎందుకో మౌనంగా ఉన్నది
సుత్తెను కూరాడు కుండలా భుజాన పెట్టుకొని
నాగలిని వడ్డాణంగా చుట్టుకొని
చక్రాన్ని చాపలా చుట్టుకొని
ఉలిని సిగలో తురుముకొని
కొడవలిని చంద్రవంకలా చేసుకొని
అరుగుమీంచి లేచింది
పెద్దర్వాజ దాటింది... వాడను దాటింది
ఊరి కొసకచ్చింది
వెనక్కి తిరిగి చూసింది
కండ్ల నుంచి జలపాతం మౌనంగా దుంకుతున్నది
నోరు తెరచి డప్పంత అరవాలనుకుంది
తనకన్నా ముందే ఉరుకుతున్న నెత్తురు చుక్కలు
ఆ చుక్కల వెనక తను కొంతదూరం
తన నడికట్టు మూట ముడివిప్పి
పిడికెడు విత్తనాలు తీసి..
భూమ్మీద చల్లింది
విత్తనాలు అనేక భాషల్లో తర్జుమా అవుతూ
ఆమెకు గొడుగుపట్టాయి

**నూర శ్రీనివాస్**

---

మహాభారతం అనగానే తెలుగువారికి ముందుగా శ్రీకృష్ణపరమాత్మ, కౌరవ పాండవులు, భగవద్గీత ఎలా యాదికి వస్తాయో.. శ్రీకృష్ణ రాయబారం కూడా అలాగే యాదికొస్తుంది. తెలుగు భాష మీద, తెలుగు పద్యాల మీద, తెలుగు పౌరాణిక సినిమాల మీద కాస్త పట్టు ఉన్నవారికి తిరుపతి వేంకట కవులు రాసిన 'పాండవోద్యోగ విజయములు'లోని పద్యాలు, అదిగో ద్వారక.. శ్రీకృష్ణుని పడకసీను పద్యాలు వంటివి కూడా యాదికి వస్తాయి. ఇక శ్రీకృష్ణ రాయబారంలోని 'మామా సాత్యవతేయు పౌత్ర... తమ్ముని కొడుకులు సగ పాలిమ్మనిరి... అటుల యిష్టపడరేనియు అయిదూళ్లిమ్మనిరి అయిదుగురకు.. చెల్లియో చెల్లకో తమరు సేసిన యెగ్గులు సైచిరందరున్..' వంటి పద్యాలు గుర్తుకొస్తాయి.



# రాయబారమంటే.. అదొక్కటే కాదు

వేదవ్యాస భగవానుడు సంస్కృత భాషలో జయసంహిత పేరుతో మహాభారతాన్ని మొదట రాశారు. పంచమ వేదం అనదగిన మహాభారతం వేదవ్యాస మహర్షి రచన అన్నది ఎంత నిజమో.. మహాభారతంలోని సత్యవతీ సుతుడు సాత్యవతేయుడు కృష్ణద్వైపాయన వేద వ్యాసుడు అన్నది అంతే నిజం. కాబట్టి, వేద వ్యాసుని మహాభారతం రచన వాస్తవానికి అతి దగ్గరగా ఉంటుందని చెప్పవచ్చు. వ్యాస మహాభారతాన్ని చాలామంది కవులు వివిధ భాషల్లోకి అనువదించారు. మనం కవిత్రయంగా పిలుచుకునే నన్నయ్య, తిక్కన, ఎర్రనలు తెలుగులో అనువదించారు. అంతేకాదు, దీని ఆధారంగా అనేక నాటకాలు, సినిమాలు వచ్చాయి.

> **తెలుగులో మహాభారత వృత్తాంతం ఆధారంగా వచ్చిన అనేక సినిమాలు కథాపరంగా గాడి తప్పాయి. ముఖ్యంగా రాయబారాల విషయానికొస్తే శ్రీకృష్ణ రాయబారం ఒక్కటే మన సినిమాల్లో ఉంటుంది. నిజానికి వ్యాస మహాభారతంలో నాలుగు రాయబారాలు ఉంటా యి. కవిత్రయం రాసిన మహాభారతంలోనూ నాలుగు రాయబారాలుంటాయి. కానీ, శ్రీకృష్ణ రాయబారం మాత్రమే తెలుగునాట బాగా ప్రాచుర్యం పొందింది. అది తెలుగు నాటకాలు, సినిమాల ప్రభావమేనని చెప్పవచ్చు.**

ఇక మహాభారతంలోని రాయబారాల విషయానికొస్తే.. పాండవుల అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తయ్యాక విరాటరాజు ఉత్తర గోసంరక్షణ విషయంలో కౌరవులకు, అర్జునునికి నడుమ యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో అర్జునుడిదే పైచెయ్యి అవుతుంది. కర్ణుడు కూడా ఓడిపోతాడు. ఆ తర్వాత విరాట మహారాజు, శ్రీకృష్ణుడు, ద్రుపదుడు, బలరాముడు, సాత్యకి, పాండవులు, వారి హితులు ఒకచోట సమావేశమవుతారు. అప్పుడు పాండవుల రాజ్యం గురించి శ్రీకృష్ణుడు ప్రస్తావిస్తాడు. సమావేశంలోని అందరి ఆలోచనలను మన్నించి ద్రుపదుడు తన అగ్ర పురోహితుడిని కౌరవుల వద్దకు రాయబారిగా పంపుతాడు. ఇదే మొదటి రాయబారం. దీన్నే బ్రాహ్మణ రాయబారం అంటారు.

హస్తినలో బ్రాహ్మణ రాయబారం జరుగుతుంది. పాండవుల అరణ్య, అజ్ఞాతవాసాలు పూర్తయ్యాయని, వారి రాజ్యం వారికివ్వాలనే అంశమే బ్రాహ్మణ రాయబారంలో ఉంటుంది.

ఆ తర్వాత హస్తినలోనూ రాయబారం అంశం చర్చకు వస్తుంది. సంజయుడిని కౌరవులు తమ రాయబారిగా పంపుతారు. 'ఏదేమైనా యుద్ధం వద్దు. సుయోధనుడు ఎవరి మాట వినడు. మీరు రాజ్యాన్ని కోరవద్దు..' అన్నట్లు ఈ రాయబారం సాగుతుంది. అప్పుడు తానే కౌరవసభకు వస్తానని సంజయునితో శ్రీకృష్ణుడు చెబుతాడు. పాండవుల వద్ద నుంచి వచ్చిన సంజయుని మాటలు విని మొదట ధృతరాష్ట్రుడు భయపడతాడు. ఇక్కడే విదుర నీతులు ఉంటాయి.

**ఆ తర్వాత శ్రీకృష్ణ రాయబారం ఉంటుంది. ఇది మూడో రాయబారం. హస్తినకు వచ్చిన శ్రీకృష్ణుడిని ధృతరాష్ట్రుడు సాదరంగా స్వాగతం పలుకుతాడు. శ్రీకృష్ణుడు మరుసటి రోజు తను వచ్చిన విషయం చెప్పడానికి కౌరవసభకు వెళతాడు. అక్కడ జరిగిన చర్చే శ్రీకృష్ణుడిని బంధించే వరకు వెళ్తుంది.**

ఆ తర్వాత శకుని కుమారుడైన ఉలూకుని రాయబారం ఉంటుంది. ఇది నాలుగవ రాయబారం. ఇది తొడగొట్టు, మెడకొట్టు, పడగొట్టు అన్నట్లు ఉంటుంది. ఇలా మహాభారతంలో నాలుగు రాయబారాలు ఉంటాయి. ఈ నాలుగు రాయబారాలను నిశితంగా పరిశీలిస్తే, ఇవి సామ దానభేదదండోపాయ ధర్మాలను కలిగి ఉంటాయి. ఓవైపు యుద్ధ సన్నాహాలు చేసుకుంటూనే కౌరవ, పాండవులు రాయబారాలను నడిపిస్తారు.

ఒకసారి తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే కవిత్రయం అనువదించిన మహాభారతం, రకరకాల ప్రక్రియల్లో మహాభారతాలు రాసిన కవులు స్వేచ్ఛ పేరుతో అందులోని పాత్రల గుణగణాలను ఇష్టం వచ్చినట్లు మార్చేశారని చెప్పక తప్పదు. అలాగే వ్యాస భారతంలో లేని అనేక కట్టుకథలను కల్పించి రాశారు. ఇదెంత వరకు సమంజసం.

ఉదాహరణకు నన్నయ్య, తిక్కన, ఎర్రనలు అంటే ఇష్టం ఉన్నవారు వారి భారతమే వాస్తవం అంటారు. అంతేతప్ప, వ్యాస భారతాన్ని పరిశీలించరు. అభిమానం హద్దులు దాటితే అవాస్తవమే వాస్తవం అవుతుంది. నేటి సినిమాల్లో జరుగుతున్నది అదే. కాబట్టి, ఇప్పటికైనా మన వేద పురాణేతిహాసాల మీద అభిమానం ఉన్న పండితులు వాస్తవాలను గ్రహించాలి. లేకుంటే రాముడుకు సీత ఏమవుతుంది? పంచ పాండవుల్లో అర్జునుడు ఉంటే బాగుంటుందా? కర్ణుడు ఉంటే బాగుంటుందా? అనే అర్థరహిత చర్చలే అగ్రపీఠాన నిలుస్తాయి.

**వాగుమూడి లక్ష్మీరాఘవరావు**
62814 90160

---

# హాస్య ఔషధం.. ఈ 'జాతి రత్నాలు'

ఈ పుస్తకం తెరిస్తే ఒక్కోసారి అనిపిస్తుంది, అబ్బ... ఏం పుస్తకం చదివామని, ఎందుకింత ఆలస్యంగా తెరిచామని. అయినా అంతలోనే ఆనందపడతాం. లేదు లేదు ఉబ్బితబ్బిబ్బవుతాం.. ఇప్పుడైనా చదివామని. అదిగో అంతలా హాస్య పరవశంలోకి తీసుకెళ్తుంది మరి. రచయిత గోపి ఏ సమయంలో రాశారో, ఎంతలా నవ్వుకుంటూ రాశారో పాఠకులను నవ్వించడానికి. హాస్యమే ప్రధాన ఎజెండాగా, పాఠకులను నవ్వించడమే ముఖ్యాంశంగా ఇటీవల ఆవిష్కృతమైన పుస్తకమే ఈ 'జాతి రత్నాలు'.



> **తాను పనిచేసే వృత్తి తాలూకు ప్రభావం మనిషిపై పడటం అత్యంత సహజం. అందుకు రచయిత గోపిరెడ్డి అతీతులని చెప్పవచ్చు. వృత్తిరీత్యా పోలీసు అయిన రచయిత ఆ ప్రభావానికి ఏ మాత్రం లోనుకాలేదు. 'పోలీసులు కఠినంగా ఉంటారు, వాళ్లకు మనసనేది ఉండదు, వాళ్లకింక నవ్వించడం ఏం తెలుసు' అనేవారు ఇకపై తమ నోటికి తాళం వేసుకోవాల్సిందే. నేటి సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో కొండెక్కిన ప్రజలకు హాస్యం అందించి నేలదారిని చూపిన ప్రతిభాత్మక రచయిత ఈ గోపి సార్. ఆయనకు రాంబాబు ఎక్కడ దొరికాడో, ఎలా పట్టుకున్నారో గానీ రాంబాబుకు పాఠకులు కృతజ్ఞతాబద్ధులవ్వాల్సిందే.**

జాతి రత్నాలులో మొత్తం 34 కథలున్నాయి. ఇందులో ప్రతికథా ఒక హాస్యాణిముత్యమే. వెతికినోళ్లకు దొరికినంత హాస్యం. సన్మాన సౌరభంలో కథలో 'రాజకీయాల్లో మాత్రం కిరాణం మర్చంట్ స్థాయి దాటలేదు, సరస సన్మానాలు అనే సబ్జెక్ట్ మీద డాక్టరేట్ సాధించారు' అనే వాక్యాలు సరసులకు నవ్వులపువ్వులు పూయిస్తాయి. సన్నాయి నొక్కులు, వక్తలు – శ్రోతలు, గమ్మత్తు దొంగ, దొంగను పట్టించిన వార్త తదితర విభిన్న పేర్లతో ఉన్న కథలు నవ్వించి కడుపు కుట్టుబట్టిస్తాయి. రచయిత ఒక్కో కథను రాశాక పేరు పెట్టారో, పెట్టాక రాశారో గానీ శీర్షికకు తగ్గట్టు హాస్యాన్ని జోడించారు. చివరిదైన 'వీర బాదుడు' కథలో క్రికెట్‌కు సంబంధించిన ప్రశ్నలు – జవాబులను చదివితే నవ్వకుండా ఉండలేం.

హాస్య కథల్లో మొదటిదైన మైకే నా ప్రాణంలో 'ప్రభుత్వం తాటి అకాడమీని స్థాపించాలి' అనే వాక్యాన్ని సృజించారు రచయిత. ఇటువంటి వాక్య ప్రయోగాలు ఈ పొత్తంలో కోకొల్లలు. ఇటీవల వెలువడిన పుస్తకాలలో హాస్యంలో శిఖరాయమానమైన పుస్తకం ఈ జాతిరత్నాలని అనవచ్చు.

**డా.ఘనపురం సుదర్శన్**
90004 70542

---

పుట్టిందీ, పెరిగిందీ ఉర్దూ వాసనే లేని పూర్తి తెలుగు సంప్రదాయ కోస్తా కుటుంబంలో. అలాంటి ఆయన ఎలాంటి పరిచయం లేని ఉర్దూను చదవడం, రాయడం నేర్చుకోవడం ఒక ఎత్తయితే.. రచయితగా, అనువాదకుడిగా పేరు తెచ్చుకోవడం మరో ఎత్తు. ఉర్దూను పట్టుదలతో అభ్యసించి అందులో రచనలు చేసి, సాహితీవేత్తగా ఎదిగారు విశ్రాంత పాత్రికేయులు మూర్తి. నిజాం జమానాలో అధికార భాష అయిన ఉర్దూపై సాధికారత సాధించారాయన. ప్రముఖ రచయితలు రాసిన తొమ్మిది ఉర్దూ పుస్తకాలను, ఒక హిందీ కథా సంకలనాన్ని తెలుగులోకి అనువదించారు కూడా. కేంద్ర ప్రభుత్వ ఉర్దూ భాషా అభివృద్ధి జాతీయ మండలి సభ్యుడు అయిన మూర్తి ఉర్దూలో గజళ్లు కూడా రాశారు. గతంలో పాత్రికేయుడిగా ఉర్దూ ముషాయిరాలను రిపోర్టు చేశారు. పదుల్లపర్తి వెంకట సూర్యనారాయణ మూర్తి.. క్లుప్తంగా పి.వి.ఎస్.మూర్తిని మెహక్ హైదరాబాదీగా తీర్చిదిద్దిన పరిణామక్రమం వెనక ఉన్న అద్వితీయమైన సాధన, కృషి ఎందరికో ఆదర్శం.

# ఉర్దూ సాహిత్యానికి తెలుగు మెహక్

హైదరాబాద్‌లో పుట్టి పెరిగినవారు ఉర్దూ నేర్చుకోవడం పెద్ద విషయం కాదు. కానీ, భాష కంటే యాసకు ఎక్కువ ప్రాధాన్యమిచ్చే ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ఉండ్రాజవరంలో జన్మించిన మూర్తి.. ఉర్దూ సాహితీవేత్తగా పేరు ప్రఖ్యాతులు గడించడం విశేషమే మరి. పాత్రికేయుడిగా పనిచేస్తున్న మూర్తి 1991లో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు బదిలీ కావడం ఒక పెద్ద మలుపు. ఆయన ఉర్దూ సఫర్ నిజానికి యాదృచ్ఛికంగా మొదలైంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో మూడు పదుల వయసులో ఆయన మళ్లీ బలపం పట్టి ఉర్దూ వర్ణమాల దిద్దారు. ఎందుకంటే, ఆ కొలువుకు ఉర్దూ తప్పనిసరి. అట్లా మొదలైన ఆయన ఉర్దూ సాధన కాలక్రమంలో అతన్ని సాహితీకారునిగా మలిచింది.

అయితే, మూర్తికి ఉర్దూ ఓ పట్టాన పట్టుబడలేదు. గురువు కోసం నెలలుగా అన్వేషించిన ఆయనకు రిటైర్డ్ డీఎస్పీ మోహన్ జీ అంబాజీ మాల్వే వద్ద శిష్యరికం చేసే అవకాశం లభించింది. మరాఠా గురువుకేమో తెలుగు రాదు. ఈయనకు ఉర్దూ రాదు. వారిద్దరినీ కలిపింది హిందీ. ఒక నెలలో నేర్చుకున్న ఉర్దూతో మూర్తి ఇంటర్వ్యూకి వెళితే అందులో సఫలం కాలేకపోయారు. కానీ, నిరుత్సాహపడకుండా తన గురువు వద్ద రెండేళ్ల పాటు ఉర్దూ నేర్చుకున్నారు. ఆ తర్వాత రిపోర్టర్‌గా ఉర్దూ ప్రోగ్రాంలు, సెమినార్లు, ముషాయిరాలకు హాజరై ప్రత్యేక కథనాలు, వార్తలు రాశారు. వృత్తిరీత్యా జర్నలిస్టు కాబట్టి, ఉర్దూ పత్రికలలో వచ్చే ఆసక్తికరమైన వ్యాసాలను అనువదించారు. మాజీ ప్రధాని ఐ.కే. గుజ్రాల్, రాజ్‌బహదూర్ గౌడ్ మౌలానా వహీదుద్దీన్ ఖాన్, జఫర్ ఆఘా వంటి ప్రముఖులు రాసిన వ్యాసాలనూ ఆయన అనువదించారు.

ఉర్దూ నేర్చుకున్న తర్వాత గజల్ మీదికి మనసు పోకుండా ఉంటుందా! నుమాయిష్ మైదాన్‌లో ఏటా జరిగే శంకర్ జీ యాద్గార్ ముషాయిరాతో పాటు అదబీ ట్రస్ట్ ఇంకా పలు ముషాయిరాలకు ఒక సాహిత్య అభిమానిగా హాజరై వాటిని ఆస్వాదించారు మూర్తి. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ షాయర్ జనాబ్ రెహ్మాన్ జామి వద్ద గజల్ వ్యాకరణం నేర్చుకున్నారు. సాధారణంగా ఉర్దూలో మారుపేరుతో లేదా కలం పేరుతో గజల్స్ రాసే సంప్రదాయం ఉంటుంది. అందుకే పి.వి.ఎస్.మూర్తి కాస్త మెహక్ హైదరాబాదీగా మారిపోయారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ షాయర్ జనాబ్ ముజ్తర్ మజాజ్ ఈ కలం పేరును సూచించారట. ఒక అక్షర భేదంతో ఒకే ఉచ్చారణతో పలికే 'మెహక్' పదానికి 'పరిమళం', 'గీటురాయి' అని రెండు వేర్వేరు అర్థాలున్నాయి. అందులో రెండోదే తాను ఎంచుకున్నానని మూర్తి చెప్పారు. మెహక్ రాసిన గజల్స్‌లో శ్రీకాంతాచారి అమరత్వంపై రాసిన గజల్ ప్రత్యేకమైనది. ఇది ఉర్దూ పత్రిక 'ఎతెమాద్' సాహిత్య పేజీలో అచ్చయ్యింది.

జీలానీ బానూ గతంలో రచించిన 'ములిజిమ్' అనే పాత కథ 2002లో జరిగిన గుజరాత్ మతకలహాల నేపథ్యంలో 'సియాసత్' పత్రికలో మళ్లీ ప్రచురితమైంది. అది హిందూ–ముస్లిం మత సామరస్యానికి సంబంధించినది. ఆ కథను 'నేరస్థుడు' పేరిట తెలుగులోకి అనువదించిన మూర్తి తన సాహితీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. చిన్నచిన్న కథలతో మొదలుపెట్టి క్రమంగా నవలలు కూడా అనువదించే స్థాయికి ఎదిగారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత్రి జీలానీ బానూ కథలను 'గుప్పిట జారే ఇసుక', 'అంతా నిజమే చెప్తా' పేర్లతో అనువదించారు. ఆమె బాల్య జ్ఞాపకాలను 'తెరిచిన పుస్తకం' పేరిట గ్రంథస్థం చేశారు. ప్రసిద్ధ రచయిత సాదత్ హసన్ మంటో కథలను రెండు సంపుటాలుగా తెచ్చారు. అమృతా ప్రీతమ్ రచన 'పింజర్' నవలను 'అస్థిపంజరం' పేరుతో తెలుగులోకి అనువదించారు.

అన్నింటికన్నా ప్రధానంగా హైదరాబాద్ స్టేట్‌కు సంబంధించి రెండు ముఖ్యమైన పుస్తకాలను మెహక్ అనువదించారు. అందులో ఒకటి ప్రసిద్ధ కవి మఖ్దూమ్ మొహియుద్దీన్ రాసినది. ఆ పుస్తకాన్ని నాటి నిజాం సర్కార్ నిషేధించింది. అప్పట్లో సంచలనం రేకెత్తించిన ఈ పుస్తకం రహస్యంగా లాహోర్‌లో ముద్రితమైంది. అట్లాగే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర తొలి తరం పోరాట యోధుడు, సోషలిస్టు దిగ్గజం, ఆదిలాబాద్ మాజీ ఎంపీ చెరుకు మాధవరెడ్డి.. హైదరాబాద్ స్టేట్ పరిణామాలపై 1948లో ఉర్దూలో రాసిన 'హైదరాబాద్ ప్రజా సమరం' పుస్తకాన్ని మెహక్ అనువదించారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ దళిత రచయిత, వాగ్గేయకారుడు అణ్ణాభావూ సాఠే కథలను ఇటీవల హిందీ నుంచి తెలుగులోకి అనువదించారు. ప్రస్తుతం ఆయన కేంద్ర సాహిత్య అకాడమీకి సంబంధించిన మూడు ఉర్దూ అనువాద ప్రాజెక్టులు చేపట్టారు. వాటి లో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రచయిత బేగ్ ఎహ్సాస్ కథా సంకలనం 'దఖ్మ', బీహార్ రచయిత హుసేనుల్ హక్ నవల 'అమావాస్ మే ఖ్వాబ్', జ్ఞానచంద్ జైన్ మోనోగ్రాఫ్ ఉండటం విశేషం.

అంతేకాకుండా, హైదరాబాద్‌లో గత శతాబ్ది కాలం లో వందమంది ఉర్దూ రచయితలకు చెందిన ఒక్కొక్క కథను తెలుగులోకి తీసుకొచ్చే ఒక బృహత్ ప్రాజెక్టుకు చాలా ఏండ్ల క్రితమే ప్రణాళిక వేసుకున్నారు మెహక్. దీనిలో భాగంగా ఏడాది కిందట 'గుల్‌దస్త' పేరుతో తొలి సంకలనం తెచ్చారు. భవిష్యత్తులో మరో రెండు సంకలనాలు తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉర్దూ పుస్తకాలను అనువదించడమే కాదు, ఉర్దూ నేర్చుకొనే ఔత్సాహికులను కూడా మూర్తి ప్రోత్సహించారు. గతంలో తాను పనిచేసిన ఓ పత్రికలో హైదరాబాత్ పేరుతో ఒక కాలమ్ నడిపారు. రోజూ నాలుగు ఉర్దూ పదాలు, వాటికి తెలుగు అర్థాలు అందులో వచ్చేవి.

'గుప్పిట జారే ఇసుక' పుస్తకానికిగానూ తెలుగు విశ్వవిద్యాలయం ఉత్తమ అనువాద పురస్కారంతో మెహక్‌ను సత్కరించింది. అంతేకాదు, కేంద్ర ప్రభుత్వంలోని ఉర్దూ భాషా అభివృద్ధి జాతీయ మండలిలో ఆయన్ని సభ్యునిగా నియమించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఒక తెలుగు వ్యక్తికి ఈ గౌరవం దక్కడం ఇదే ప్రథమం. సాహితీ కృషిలో ఆయన మరిన్ని మెట్లు ఎక్కాలని ఆశిద్దాం.



**తుమ్మలపల్లి రఘురాములు**
93463 28291

---

## సాహిత్య సదస్సు

హైదరాబాద్‌లోని రవీంద్రభారతి సమావేశ మందిరంలో 2024 డిసెంబర్ 8న తెలంగాణ రచయితల సంఘం పదేండ్ల సాహిత్య సభలు జరగనున్నాయి. ఈ సభలో 'తెలంగాణ అస్తిత్వ సాహిత్యం– వర్తమాన సందర్భం' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించనున్నారు. సాహిత్య సదస్సు, కవి సమ్మేళనం, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు ఉంటాయి. పరాంకుశం వేణుగోపాలస్వామి ప్రారంభోపన్యాసం చేయనున్నారు. డా.నాళేశ్వరం శంకరం, డా.నందిని సిధారెడ్డి, దేశపతి శ్రీనివాస్, సూర్యా ధనుంజయ్, డా.మామిడి హరికృష్ణ, కందుకూరి శ్రీరాములు, డా.వి.శంకర్, ఘనపురం దేవేందర్, సి.కాశిం, వారాల ఆనంద్, కొత్త అనిల్ కుమార్, బెల్లంకొండ సంపత్‌కుమార్, పొట్లపల్లి శ్రీనివాసరావు, కొల్లాపురం విమల, అయినంపూడి శ్రీలక్ష్మి, దేవనపల్లి వీణావాణి, దాస్యం సేనాధిపతి, డా.శ్రీరామోజు హరగోపాల్, రాఘవాచార్య, నెల్లుట్ల రమాదేవి, గజ్జెల రామకృష్ణ తదితరులు హాజరుకానున్నారు.

## పుస్తక పరిచయం

**తెలంగాణ** భాషా సాంస్కృతిక శాఖ, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక సంయుక్తాధ్వర్యంలో 2024 డిసెంబర్ 3న హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో వనపట్ల సుబ్బయ్య దీర్ఘకావ్యం 'అసిపె' పరిచయ సభ జరగనున్నది. పి.వహీద్ ఖాన్ సభాధ్యక్షత వహించనున్నారు. అతిథులుగా గోరటి వెంకన్న, జూలూ రు గౌరీశంకర్, గుంటూరు లక్ష్మీనరస య్య, ఎస్.రఘు, యాకూబ్, సంగిశెట్టి శ్రీనివాస్, సీతారాం, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ఉప్పల బాలరాజు, నాగవరం బాల్ రాం, కోడెపాక కుమారస్వామి, సూర్యపల్లి శ్రీనివాస్, నారు, కందికొండ మోహన్ తదితరులు హాజరుకానున్నారు.

**- నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక**

## ఆవిష్కరణ

హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజ్, పీజీ సెమినార్ హాల్‌లో 2024 డిసెంబర్ 5న **జంబూ** సాహితీ దళిత కథల సంకలనం 'కొమ్ము' ఆవిష్కరణ సభ జరగనున్నది. ఆచార్య సూర్యా ధనంజయ్ పుస్తకాన్ని ఆవిష్కరించనున్నారు. డా.సిద్దెంకి యాదగిరి సభాధ్యక్షత వహిస్తారు. డా.తిప్పర్తి యాదయ్య, సతీష్ చందర్, కాశిం, జూలూరు గౌరీ శంకర్, కోయి కోటేశ్వరరావు, గడ్డం మోహన్‌రావు, గుడిపల్లి నిరంజన్, తప్పెట ఓదయ్య హాజరుకానున్నారు.

**- సంపాదకులు, జంబూ సాహితీ**

---

**మార్పు శాశ్వతం అనే చమత్కారాన్ని మనం తరచూ వింటూనే ఉంటాం. తెలుగు సాహిత్యంలో ఈ మార్పును కవులు బాగానే ఒంటపట్టించుకున్నారు. ముఖ్యంగా తమ కవిత్వ సంకలనాల శీర్షికల విషయంలో ఈ మార్పు కనిపిస్తుంది. ఇంతకుముందు అంటే రెండు, మూడు దశాబ్దాల క్రితం అన్నమాట.. కవిత్వ సంకలనాలకు మూస టైటిళ్లు ఉండేవి. తాము రాసిన కవితల్లో ఓ కవిత పేరే సంకలనానికి పెట్టేవారు. ఇది ఇప్పుడూ కొనసాగుతోంది కానీ, ఆ కవితకు పెడుతున్న శీర్షికే కొత్తగా, ఆకర్షణీయంగా ఉంటోంది. ముఖ్యంగా ఓ దశాబ్దం నుంచి కవుల్లో ఈ మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. ఇదే మార్పు కోరిన తరంగా కనిపిస్తోంది.**

# పేరులోనే అంతా ఉంది

**గట్లుంటది..**

'**ఒక వెళ్లిపోతాను**' అని ఎం.ఎస్.నాయుడు తన కవిత్వ సంకలనానికి అందులోని ఒక పద్యం పేరే పెడితే తెలుగు సాహిత్య లోకమంతా చాలా ఆశ్చర్యపోయింది. ఆ కవిత్వ సంకలనాన్ని ఆవిష్కరించిన ప్రముఖ కవయిత్రి విమల అయితే, ఆ పేరు చూసి కవిత్వంలో ఎన్ని మార్పులు వస్తున్నాయో అని ఆశ్చర్యచకితులయ్యారు. ఆ సభలోనే విమల మాట్లాడుతూ ఒక్క లైనులోనే ఓ కవితను చెబుతున్న వారూ ఉన్నారన్నారు. ఇదీ నేటి కవిత్వ భాష. ఇక ప్రసేన్ అయితే తన మూడు కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు చూసి ఆ కవిత్వం చదవాలనిపిస్తుంది. (కొనాలనిపించదు. కొట్టేసి చదవాలనిపిస్తుంది). ప్రసేన్‌కు జర్నలిస్టుగా అనుభవం ఎక్కువే కాబట్టి, అక్కడ హెడ్డింగులు పెట్టినట్టే తన కవిత్వ సంకలనాలకు కొత్తకొత్త పేర్లు పెట్టి పాఠకులను తన వైపు తిప్పుకునేలా చేస్తున్నారాయన. 'Don't Judge A Book by It's Cover' అంటూ కార్పొరేట్ ప్రకటనలు వస్తున్నాయి కానీ, తెలుగు కవిత్వాన్ని మాత్రం ఆ కవర్ పేజీ, ముఖ్యంగా ఆ సంకలనానికి పెట్టిన పేరుని బట్టే చదువుతున్నారు. అంతేకాదు.. పుస్తక ప్రదర్శనల్లో కొంటున్నారు కూడా.

> **ప్రసేన్ తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కొందరికి కొత్తగా అనిపిస్తే... ఇంకొందరికి మాత్రం గమ్మత్తుగా అనిపించాయి. నాకు భలే నచ్చాయి ఆ పేర్లు. ప్రసేన్ రాసిన ఓ కవిత్వ సంకలనం పేరు 'ఇంకా వుంది'. సృజనకారులకు ఎందులోనూ ముగింపు ఉండదు. కవి అనండి, రచయిత్రి కానివ్వండి ఏది రాసినా అంతా అసంపూర్ణమే. వాళ్లు చెప్పేందుకు ఇంకా చాలానే ఉం టుంది. బహుశా అందుకు సంకేతమే ఈ 'ఇంకా వుంది'.**

ఇలాంటి తాత్వికతే మరో రెండు సంకలనాల టైటిళ్లలోనూ కనిపిస్తుంది. అందులో ఒకటి 'ఎవరికి వర్తిస్తే వారికి'. ఈ కవిత్వం చదవడానికి కాసింత ధైర్యం కావాలనిపిస్తుంది. ఆ సంకలనం తెరిస్తే 'మన గురించి, మనల్ని ఉద్దేశించి ఏమైనా రాశారా, మనల్ని మన అద్దంలో చూపించారా...!? లేదా తన అద్దంలో చూపించారా...!?' అనే సంశయం ప్రారంభమవుతుంది. ఏది కనిపించినా అది ఎవరికి వర్తిస్తే వారికి అలా...

సీనియర్ కవిగా గుర్తింపు పొందిన జూకంటి జగన్నాథం తన కవిత్వ సంకలనాలకు పెట్టిన పేర్లు కూడా భలే గమ్మత్తుగా ఉంటాయి, బాగుంటాయి. ఈ మధ్య ఖమ్మం ఈస్థటిక్స్‌వారు ఉత్తమ కవిత్వ సంకలనంగా జూకంటి రాసిన 'ఒక కప్పు చాయ్ నాలుగు మెస్సేజ్ లు'కే ప్రకటించారు. ఈ సంకలనానికి అవార్డు ప్రకటించారని తెలియగానే తొలుత ఆశ్చర్యపోయాను. జూకంటి ఇప్పటి కవి కాదు. ఇంతకుముందు కూడా తన కవిత్వ సంపుటాలకు 'ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' అని, 'వాస్కోడిగామా డాట్‌కామ్' అని సరికొత్త పేర్లు పెట్టారాయన. అంటే నేటి తరంతో నాటి జూకంటి అప్‌డేట్ అవుతున్నారనిపించింది. ఊరికే పేరేనా... లోపల విషయం ఉందా అని చూస్తే చాలానే ఉందనిపిస్తుంది.

ఈ కప్పు చాయ్ పద్యం 'వన్నెల వెన్నెలని చూడలేడు/ ఉదార హృదయాన్ని కనలేడు' అంటూ ప్రారంభమై మధ్యలో 'ఏమరుపాటుగా కుర్చీలో కూర్చుని/ ఒక కప్పు చాయ్ సిప్ చేస్తూ/ సెల్‌లో ఎంగిలి మెసేజ్‌లు చదువుతూ/ కొత్త ప్రపంచంలోకి ప్రవేశం/ కాకిలగ్గం డేటింగ్ చాటింగ్ చేస్తుంటాడు' అంటారు. ఎంత గొప్పగా వెటకరించారు సెల్‌ఫోన్‌లే లోకంగా బతుకుతున్న నేటితరాన్ని. కవులే కాదు.. కవయిత్రులు కూడా తమ సంకలనాలకు సరికొత్త పేర్లు పెడుతూ పాఠకులకు చేరువవుతున్నారు. తోట సుభాషిణి 'ఒకటి ఒకటి పదకొండు', మందరపు హైమావతి 'రాతిచెయ్యి' కవిత్వ సంకలనాలు తీసుకొచ్చారు. తన కవిత్వ సంకలనాలకు 'లోహనది', 'మరో దశ' వంటి సీరియస్ పేర్లు పెట్టిన వసీరా మూడో సంకలనానికి మాత్రం 'సెల్ఫీ' అని నామకరణం చేశారు. ఇది తన మూడు దశాబ్దాల కవిత్వ ప్రయాణంలో తానే తీసుకున్న సెల్ఫీ. ఎప్పుడూ అచ్చమైన కవిత్వం రాసే పసునూరి శ్రీధర్‌బాబు 'నిద్రపోని మెలకువ చెప్పిన కల' అంటూ పొయెటిక్ సంకల్పం చెప్పుకొన్నారు తన కొత్త కవిత్వానికి.

తెలుగు సాహిత్యంలో చాలామందికి గురుస్థానంలోకి వచ్చిన సీనియర్ కవి శివారెడ్డి అయితే పొసగనివన్నీ కలిపి ఓ కవిత్వ సంకలనం వేశారు. అది కూడా దశాబ్దంన్నర క్రితమే. అలాగే 'పక్కకు వొత్తిగిల్లితే' ఏం జరుగుతుందో కూడా శివారెడ్డే చెప్పారు. ఎనిమిది పదుల వయసులోకి వచ్చాక అసలు సిసలు ప్రేమని కనుగొని దానికి 'Ode To Love అను ప్రేమగీతం' పాడారు. ఇంకా చాలామంది తమ కొత్త శీర్షికలు, కవిత్వ సంకలనాల పేర్లతో తెలుగు కవిత్వాన్ని వినిపిస్తున్నారు. 'పేరులోన ఏముంది' అన్నమాట కాదు నేడు వినిపిస్తున్నది.. 'పేరులోనే అంతా ఉంది' అన్నదే నేడు వినిపిస్తున్న కవిత్వం.



**ముక్కామల చక్రధర్**
99120 19929